





ఆద్యంతం..ఆత్మీయం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన శుక్రవారం ఆద్యంతం ఆత్మీయంగా సాగింది. బాపట్ల, కర్లపాలెం మండలాల్లో వరి, మిర్చి పంట పొలాలను సందర్శించి, పంట నష్టాన్ని ఆయన స్వయంగా తెలుసుకున్నారు. పెద పండగ లోపు బాధితుల కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతానని భరోసానిచ్చి.. నిజమైన ఆపద్బాంధవుడయ్యారు. కష్టం తీర్చి.. తమ కన్నీళ్లు తుడవడానికి వచ్చిన జన నేతను చూసేందుకు ప్రజలు పరుగులు తీశారు. అడుగడునా.. ఆత్మీయ స్వాగతం పలికారు. సాయమందించి అండగా ఉంటానని ఆయన మాట పూర్తికాక ముందే.. ప్రభుత్వ సాయం ఇప్పటికే తమకందిందని చెప్పి సంతోషం వ్యక్తం చేశారు. మిచాంగ్ తుపాను తీరం దాటి మిగిల్చిన నష్టం.. తమ గడప దాటేలోపు ఆదుకున్నారని జేజేలు పలికారు. – సాక్షి నెట్‌వర్క్











క్లుప్తంగా

దిగువ ప్రాంతాల్లో నీటి తరలింపు



భట్టిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని దిగువ ప్రాంతాలు జలమయమయ్యాయి. సర్పంచ్ దారా రవి కిరణ్బాయి, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని రెండు రోజులుగా ఈ ప్రాంతాల్లో నీరును బయటకు పంపేందుకు మోటార్లను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నట్లు తెలిపారు. బొందాల కాలనీ, అమ్మవారిచెట్టు, దేవినేని కాలనీల్లో మోటార్లను ఏర్పాటు చేసి, నీటిని బయటకు పంపుతున్నట్లు వివరించారు.

జిలుగువారిపాలెంలో డ్రైడే

భట్టిప్రోలు: మండలంలోని జిలుగువారిపాలెంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది నీరు నిల్వ చేరిన ప్రదేశాలలో దోమల నివారణ మందును చల్లించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ రామలక్ష్మి దోమల మందు చల్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి, ఏఎన్‌ఎంలు లీలారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగుతున్నాయి..ఆపుతున్నాయి



భట్టిప్రోలు: ఆవుల మంద రవాణాకు ఆటంకంగా మారుతోంది. భట్టిప్రోలులోని ప్రధాన రహదారుల్లో అడ్డంగా నిలబడిపోవడంతో.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు ఆపై.. ఆవులు శయనించడంతో వాటిని తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. యథేచ్ఛగా వాటి యజమానులు రోడ్లపైకి వదిలేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి రైతుకు నష్టపరిహారం



భట్టిప్రోలు: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో పంట నష్టపోయిన ప్రతి రైతుకి పరిహారం అందేలా చూస్తామని ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ కుందేటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ వీఏఏలు పారదర్శకంగా పంట నష్ట పరిహార జాబితాను తయారు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య మాట్లాడుతూ పంట పొలాల్లో చేరిన నీటిని ఎన్ఆర్ఈజీఎస్ కూలీల ద్వారా బయటకు పంపేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వెటర్నరీ డాక్టర్ బొర్రా లక్ష్మి రంజిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరి



రేపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శివపార్వతి అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని పేటేరు సచివాలయ కేంద్ర ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసను నివారించి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి ఎంతగానో ఆదరణ లభిస్తోందన్నారు. పలు పథకాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పుష్పకుమారి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ రవికిరణ్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్తిక మాసం ప్రత్యేక పూజలు



బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగాపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాసం శుక్రవారం విశేష అభిషేకం, అమ్మవారికి ప్రీతికరమైన శ్రీ సూక్తంతో హరిద్ర (పసుపు) అభిషేక నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట శివ వరప్రసాద్ స్వామి వారిని 'హరిద్రాలింగేశ్వరుని' అలంకరించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పాల్గొన్నారు. అర్చకులు గూడూరు చిట్టి బాబు, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంత రావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, యల్లాప్రగడ వెంకటరమణ స్వామివారికి ప్రత్యేక పూజలు, లింగాష్టకం పఠించారు.

శివాలయాల్లో ఏకాదశి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజ నరేంద్రస్వామి

పెదపులివర్రు(భట్టిప్రోలు): స్థానికంగా కొలువైన బాల త్రిపుర సుందరి సమేత హేమ వితలేశ్వరస్వామి దేవాలయంలో ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి స్వామికి 26వ రోజు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ద్వాదశ హారతులు ప్రతినిత్యం కొనసాగుతున్నాయి. రాత్రి సహస్ర దీపాలంకరణ ముగ్ధ మనోహరంగా నిర్వహించారు. పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆయా దేవాలయాల అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, దీవి రాంబాబు, మురికిపూడి దుర్గా ప్రసాద్ శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, ఈఓ మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

రేపల్లెకు 15 టన్నుల మిశ్రమ దాణా



దాణా పంపిణీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు కేదారేశ్వర్ అన్నారు. తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అందించిన పశువుల దాణాను మండలంలోని పేటేరు, విశ్వేశ్వరం రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం పంపిణీ చేశారు. రేపల్లె మండలానికి 15 టన్నుల సపూర్ణ మిశ్రమ దాణా వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధకు సహాయ సంచాలకులు జి.నరేంద్ర, పశువైద్యాధికారులు మీనాక్షి, ప్రవీణ్, సర్పంచ్ కనపర్తి వసుమతి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, గోపాలమిత్ర పాల్గొన్నారు.

భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌కు గండి



మెయిన్ డ్రెయిన్‌కు పడిన గండి



నీటిలో మునిగిన వరి పంటను చూపుతున్న రైతులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌కు స్థానిక ఎంవీజీఆర్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో గండి పడటంతో నీరు పంట పొలాలను చుట్టుముట్టింది. దీని ప్రభావంతో కళాశాల అవతలి వైపు ఉన్న సుమారు 200 ఎకరాల పంట పొలాలు దెబ్బ తింటున్నాయి. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మెయిన్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల ఈ డ్రెయిన్ కట్టలను ప్రొక్లెయినర్‌తో పటిష్టపరిచారు. ఐనప్పటికి రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా డ్రెయిన్‌కు గండి పడింది. ఈ ప్రాంతంలో కోత కోయకోకుండా, కోతలు కోసి, కుప్పలు వేసి ఇలా వివిధ దశల్లో పంటలు ఉన్నాయి. తమను ఆదుకోవాలని రైతాంగం ముక్తకంఠంతో కోరుతుంది. ఈ విషయమై డ్రెయినేజీ ఏఈ పి.కె. చైతన్యను వివరణ ఇస్తూ.. రైతులు డ్రెయిన్‌లో నీరు పోయేందుకు అనధికారికంగా పైపులు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. దీంతో ప్రమాదం ముంచుకొచ్చిందని, ఈ విషయమై రైతులను పైపులను తొలగించాలని ఎన్నో మార్లు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం డ్రెయిన్‌లో అధికంగా నీరు పారడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి దళార్చన



తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కార్తిక మాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సుప్రభాత సేవ, అనంతరం విశ్వక్సేన పూజ నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం చేశారు. అర్చకులు టి.రఘు ఆధ్వర్యంలో మూలవిరాట్ స్వరూపానికి లక్ష తులసి దళాలతో విశేషంగా పూజ నిర్వహించి, అలంకరించారు. శాస్త్ర పండితులు వేదాంతం మాధవకుమార్ ఆగమ శాస్త్రం ప్రకారం శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి, అర్చకులు కె.అనంతాచార్యులు, శ్రీధర్, యశ్వంత్, కేశవ కుమార్, రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో శోభా యాత్ర



శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు

భట్టిప్రోలు: అయోధ్య రామాలయ నిర్మాణం భారతీయులందరికి గర్వకారణమని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) రేపల్లె, వేమూరు ఖండ ప్రముఖ్ వరికూటి శివగోపి అన్నారు. జనవరి 22న జరిగే రామమందిర ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా శ్రీరామ మందిర నిర్మాణ తీర్థ ట్రస్ట్ ద్వారా వచ్చిన అక్షింతలతో శుక్రవారం భట్టిప్రోలు ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అద్దేపల్లిలోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో గోపూజ నిర్వహించి, అక్షింతలకు అర్చకులు దీవి నాగ శేషాచార్యులు ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా శివ గోపి మాట్లాడుతూ భారత దేశంలో అయోధ్య రామునికి మందిరం నిర్మించడం అందరి కల అని అన్నారు. ఈ అక్షింతలు మండలంలోని అన్ని గ్రామాలలోని దేవాలయాల నుంచి సంయోగం చేసి ప్రతి ఇంటికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో జె. హేమశంకరరావు, ఆర్.సత్యన్నారాయణమూర్తి, సీహెచ్ రాజేష్, నాగరాజు, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, వి.చిన్నారి, వి. శ్రీనివాసరావు, పి. శ్రీనివాసు, కె. నాగరమేష్, వి. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు(బీఎస్సార్), కె. రమేష్, ఎన్. ప్రభాకరరావు, కె. చిదంబరరావు పాల్గొన్నారు.

పెదరావూరులో 'బాబూజీ' చిత్రీకరణ



చిత్రంలోని ఓ సన్నివేశం

తెనాలిరూరల్: 'బాబూజీ' చిత్రంలో మహాత్మా గాంధీ పాల్గొన్న సన్నివేశాలను రూరల్ మండలం పెదరావూరు స్టూడియోలో దర్శకుడు దిలీప్ రాజా శుక్రవారం చిత్రీకరించారు. ' ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర సంగ్రామానికి ప్రతి భారతీయుడి ప్రాణాలను అంకితం చేయాలి. వందేమాతరం ' అంటూ గాంధీజీ చెపుతున్న సంభాషణలను చిత్రీకరిస్తున్నట్లుగా స్థానిక విలేకరులకు దిలీప్ రాజా తెలిపారు. గాంధీజీ దగ్గర స్వాతంత్ర ఉద్యమంలో బాబూ జగ్జీవన్ రామ్ శిష్యరికం చేసిన సన్నివేశాల రూపకల్పన చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బాబూ జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను 'బాబూజీ' టైటిల్‌తో బయోపిక్‌గా తెనాలి పరిసర ప్రాంతాల్లో రూపొందిస్తున్న విషయం తెలిసిందే! గాంధీజీ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని కారాగారానికి వెళ్లగా జగ్జీవన్ రామ్ కూడా జైలుజీవితం గడిపిన సన్నివేశాలను ఇప్పటికే చిత్రీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. గాంధీజీ పాత్రను కేఆర్.డి.శెట్టి పోషిస్తుండగా లాల్ బహదూర్ శాస్త్రి పాత్రలో ఉత్తర ప్రదేశ్ నటుడు అమీర్ చోద్రీ, జగజ్జీవన్ రామ్ గా మిలటరీ ప్రసాద్, గాంధీజీ వెంట నిరంతరం ఉండే శిష్యురాలు 'మను' పాత్రలో పూజా కటారి, గూడెం పెద్దగా చదలవాడ హరిబాబు నటిస్తున్నారు. కెమెరా వంశీ, ఎడిటర్ నందమూరి హరి, నిర్మాత ఆలూరి సుందర రామయ్య కాగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం దిలీప్ రాజా.

ఓటు ఆవశ్యకత తెలుసుకోండి

తెనాలిఅర్బన్: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, దాని విలువను అందరూ తెలుసుకోవాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. కళాశాలలో ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు నమోదు చేసుకునే విధానం, ఉపయోగించే విధానాన్ని పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు విశ్రాంతమ్మ తెలియజేశారు. సమావేశంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, విద్యార్థినులు, ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సూడి గేదె మృతి



భట్టిప్రోలు: భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ సమీపంలో విద్యుదాఘాతంతో సుడిగేదె మృతి చెందింది. ఉంగరాల వెంకటేశ్వరరావుకు చెందిన గెదె మేత మేస్తుండగా విద్యుత్ స్తంభం వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఇది తమ పరిధిలో కాదని ఫైబర్ నెట్‌వర్క్ కారణంగా మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు.

నందివెలుగులో వికసిత్ భారత్ సమావేశం



తెనాలిటౌన్: నందివెలుగు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వికసిత్ భారత్ యాత్ర సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామంలో సర్వే పూర్తి అయిన సందర్భంగా వీఆర్వో లక్ష్మికి సర్టిఫికెట్‌ను సర్పంచ్ పవన్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలని, గ్రామాన్ని మోడల్ గ్రామంగా చేయడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో కొలకలూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్‌చంద్రబోస్, ఏపీఎం జయశ్రీ, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మి, తోటకూర కోటేశ్వరరావు, సోమరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

రేపల్లె: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లీనా తెలిపారు. తమకు అందిన సమాచారంతో గుడికాయలంక గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించగా కాసాని నాంచారమ్మ, యరగళ్ల రామకృష్ణ ఇద్దరూ వేర్వేరుగా నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి 6 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదేవిధంగా కాకుల డొంకలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న దోవ రవిని అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొల్లిపర: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కుంచవరం, అత్తోట, శిరిపురం, చివలూరు, కొల్లిపర ఆయా గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతందని చెప్పారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

